విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను తెలుగు భాష పై అవగాహన, వార్తలు రాయగల సత్తా ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక
అనంతపురం శ్రీ సత్యసాయి 5
మంగళవారం 01 ఏప్రిల్ 2025

# ప్రకాష్ రెడ్డి, గోరంట్ల మాధవ్ పై పరిటాల సునీత ఆగ్రహం

- ఐదేళ్లు ఎమ్మెల్యే, ఎంపీగా చేశారు.. కనీస విజ్ఞత ఉందా
- ఒక మనిషి చావును అడ్డం పెట్టుకుని కుల రాజకీయాలు చేస్తారా
- పాపిరెడ్డిపల్లి ఘటనలో ఒక వ్యక్తి చనిపోవడం బాధాకరం
- ఆ కుటుంబానికి సాయం చేసేందుకు ముందుకురండి..నేను వస్తాను
- ఘటన జరిగిన వెంటనే పోలీసులు దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేశారు
- పరిటాల పేరు వాడితేనే మీకు రాజకీయ భవిష్యత్ ఉంటుందా

రాప్తాడుఇ మార్చి 31 (అనంత ప్రభ)

గత ఐదేళ్లువై. ఎస్. ఆర్. పార్టీకి ఎమ్మెల్యే, గా పని చేసిన తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి,హిందూపురం మాజీ యమ్. పి.గోరంట్ల మాధవ్ కనీస విజ్ఞత లేకుండా వ్యవహరిస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి ఘటనలో తమ కుటుంబంపై చేస్తున్న ఆరోపణల మీద ఆమె తీవ్రంగా స్పందించారు. పాపిరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన సంఘటన బాధాకరమని.. ఒక వ్యక్తి చనిపోతే ఆ కుటుంబం ఎంత బాధపడుతుందో అది మాకు బాగా తెలుసన్నారు. గతంలో నా భర్త, మామ, పరిటాల హరిని కోల్పోయి ఎంత బాధ పడ్డామో మాకు తెలుసన్నారు. గ్రామంలో ఉగాది పండుగ రోజు జరిగిన ఒక సంఘటనతో ఆవేశంలో ఆయన పై జరిగిన దాడిలో బ్రెయిన్ డెడ్ తో చనిపోయాడన్నారు. ఇక్కడ చనిపోవాలని దాడి చేసిన సంఘటన కాదని.. రాజకీయాలకు, పార్టీలు, కులాలకు అసలు సంబంధమే లేదన్నారు. దీనిని అడ్డం పెట్టుకుని పరిటాల కుటుంబాన్ని టార్గెట్ చేశారన్నారు. చనిపోయిన వ్యక్తి ఇంటి పేరు వదిలేసి కురుబ లింగమయ్య అంటూ ఆ కులాన్ని రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు. గతంలో ప్రకాష్ రెడ్డి ఆత్మకూరులో ఒక వ్యక్తి తన వ్యక్తిగత కారణాలతో హత్యకు గురైతే.. దాన్ని కూడా మాపై నెట్టారన్నారు. గత 15ఏళ్లుగా కులాల్ని అడ్డం పెట్టుకుని నువ్వు రాజకీయాలు చేయడం అంతా చూశారన్నారు. రాప్తాడులో సీటు కోసం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి గొడవలు పడుతూ.. ప్రతిదీ మాకు ఆపాదిస్తున్నారన్నారు. పరిటాల కుటుంబం




పేరు చెబితేనే పెద్ద సైకో దృష్టిలో పడుతామన్న ధ్యాస తప్ప వారికి వేరే లేదన్నారు. వారి పార్టీలో ఏం చేసుకున్నా ఫర్వాలేదు కానీ.. మా కుటుంబానికి, పార్టీకి ప్రతిదీ అంటగట్టడం సరైంది కాదన్నారు. కక్షసాధింపులు అంటూ ప్రతిసారి విమర్శలు చేస్తున్నారని.. మీరు గత ఐదేళ్లలో చేసిన దాన్ని మనసులో పెట్టుకుని ఇప్పుడు అలా చేసి ఉంటే.. మీరు ఒక్క రోజు కూడా తట్టుకుని ఉండేవారా అని ప్రశ్నించారు. మీ అన్న మా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని, మా మంత్రి లోకేష్ ను ఎంతగా పచ్చిబూతులు తిట్టాడని దాని పై మేము కక్ష సాధించాలనుకుంటే ఏమయ్యేవారో చూసుకోవాలన్నారు. కురుబలు, బోయలు మా కుటుంబ సభ్యుల్లాంటి వారని.. కులాలతో రాజకీయాలు చేయాల్సిన ఖర్మ మీలాగా మాకు పట్టలేదని పరిటాల సునీత స్పష్టం చేశారు. పాపిరెడ్డిపల్లి ఘటనలో తప్పు ఎవరిదైనా సరే.. మా బంధువులని మేము వెనుకేసుకుని రాలేదని.. ఇప్పటికే ఒకర్ని అరెస్ట్ చేశారన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు రాకుండా.. శవ, కుల రాజకీయాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఆ కుటుంబానికి సాయం చేసేందుకు మేము కూడా సిద్ధంగా ఉన్నామని పరిటాల సునీత అన్నారు..

## పేదల పక్షపాతి కామ్రేడ్ తమ్మినేని రంగన్న ఆశయాలు కొనసాగించాలి





రవకొండ, మార్చి 31 (అనంత ప్రభ)

దివంగత కమ్యూనిస్టు పార్టీ నాయకులు కామ్రేడ్ తమ్మినేని రంగన్న ఆశయాలు కొనసాగించాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు కొనియాడారు. కామ్రేడ్ రంగన్న ఏడవ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం ఆయన స్వగ్రామం వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామంలో రంగన్న స్మారక స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అంతేకాకుండా ఉరవకొండ పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో కూడా రంగన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు..ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం లో కామ్రేడ్ రంగన్న కీలక పాత్ర పోషించారని ఆనాటి భూ పోరాటంలోను, ఇంటి పట్టాల కోసం, జిల్లా కు సాగునీరు, త్రాగునీరు నీరు వంటి ప్రజా సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు. ఛాయపురం గ్రామానికి వరుసగా ఆరు సార్లు సర్పంచ్ గా ఎన్నికై నియోజకవర్గ రాజకీయలలో ఎంతో ఆదర్శంగా ఉండే వారని గుర్తు చేశారు. ఇప్పటి రాజకీయాలకు ఆయన జీవితం ఎంతో స్ఫూర్తి ని ఇస్తుందని తెలిపారు. తండ్రి బాట లోనే తనయుడు రాజశేఖర్ కూడా సమాజానికి సేవ చేయాలనే తపన కలవాడుని ఎన్నో సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రంగన్న కుమారుడు రాజశేఖర మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం సేవలను అందించడం జరుగుతుందని భవిష్యత్ లో తమ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున,

సీనియర్ నాయకులు గెన్నే మల్లెసీ, పురిడీ తిప్పయ్య, హెూతురు శ్రీధర్, చెన్నా రాయుడు , చక్రధర్, సామాజికవేత్త ఆనంద్ రాజ్ , ఏ ఐవై వైఫ్ నాయకులు నవీన్ బాబు, వేణు, నరేష్,రాంచరణ్ మాజీ విద్యార్థి నాయకుడుపాటిల్ నిరంజన్ గౌడ్ ,రాకెట్ల అశోక్, ఛాయపురం గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## దళిత రైతు నాగేంద్ర తోటకు నిప్పంటించిన గుర్తుతెలియని దుండగులు
## మామిడి తోటను పరిశీలించిన అనంతపురం రూరల్ తహసీల్దార్ మోహన్

అనంతపురంఇ మార్చి 31 (అనంత ప్రభ)

అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామం దళిత రైతు బూడిద నాగేంద్ర కు చెందిన మామిడి తోటకు 29/3/25 శనివారం రాత్రి స-ుమారు 11 గంటలు సమయంలో చియ్యేడు గ్రామానికి చెందిన కొంతమంది అనుమానితులు నిప్పు అంటించడం జరిగింది. ఇందులో దళిత రైతు తోటలో పది మామిడి చెట్లు ( సుమారు15 సంవత్సరాలు వయసు కలిగినవి ), బోరెవెల్, డ్రిప్ పరికరాలు, కేబుల్ వైరు, వ్యవసాయ పరికరాలు కాలిపోవడం జరిగింది. ఈ సంఘటన పై తహసీల్దార్ మోహన్ కుమార్ స్పందిస్తూ ఇక్కడ సంఘటన పరిశీలించిన తరువాత తోటకు దుండగలు నిప్పు పెట్టిన విషయం వాస్తవమే ఇలా చేయడం చాలా బాధాకరం దళిత రైతుకు ప్రభుత్వం తరపున అన్ని రకాల సహాయసహకారాలు అందిస్తామని తెలియచేసారు. చియ్యేడు వి. ఆర్. ఓ.వేణుగోపాల్ రెడ్డియమ్. పి. ఈ. ఓ. శ్రావణిలతో పాటు ఎస్. సి. ఎస్. టి జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు నేరమెట్ల ఎల్లన్న మాట్లాడుతు సంఘటనకు కారణం అయిన నిందితులను గుర్తించి ఎస్. సి. ఎస్. టి అట్రాసిటీ యాక్ట్ ప్రకారం కఠినంగా శిక్షించాలని, ఇప్పటికే అనుమానితులపైనా ఇటుకులపల్లి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారని తెలియచేయడం జరిగింది.స్థానిక చియ్యేడు గ్రామ తెలుగుదేశం



నాయకులు చిన్న గొర్ల సాయినాథ్ రెడ్డి సంఘటన పైన మాట్లాడుతూ ఇలాంటి చర్యలకు పాల్పడటం చాలా బాధాకరం మా గ్రామం లో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని హితవు పలికారు రాప్తాడు-యమ్. యల్. ఏ.పరిటాల సునీతమ్మ గారి దృష్టికి తీసుకెళ్లి దళిత రైతుకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమం లో చియ్యేడు కృష్ణారెడ్డి, ముష్టురు రమేష్ మాదిగ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్, అడ్వకేట్ అంకె శ్రీనివాసులు, మందల చంద్ర శేఖర్, బాధిత రైతు బూడిద నాగేంద్ర, గ్రామస్థులు నరసింహులు, అదెన్న, నల్లప్ప, తదితరులు పాల్గొన్నారు

## డాక్టరేట్ పొందిన పెద్దన్న ను సన్మానించిన ప్రజా సంఘాలు

కూడేరు, మార్చి 31 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం కూడేరు మండల కేంద్రంలో తమిళనాడు ఆసియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో డాక్టరేట్ పొందిన పెద్దన్నను శాలువా కప్పి పూలమాలలు వేసి చాల ఘనంగ సన్మానించడం జరిగింది.

ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ వికలాంగుడైన గత 30 సంవత్సరాల కాలం నుండి ఎంతో ఓర్పు సహనముతో ప్రజల సంక్షేమమే ప్రజాసేవే తన ఊపిరిగ భావించి ఎన్నో అష్ట కష్టాలకు ఎంతో ఓర్పు నేర్పులతో ప్రజల సంక్షేమ కొరకు వికలాంగుల కొరకు విద్యార్థుల కొరకు మహిళల్లో చైతన్యం తీసుకురావడానికి వికలాంగులు సమాజంలో గౌరవింపబడే విధంగ ఎన్నో పోరాటాలు చేసిన వికలాంగుడు పెద్దన్నను తమిళనాడు ఆసియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ వారు గుర్తించి ఆయన సేవలను సమాజానికి మరింత తెలిపే విధంగా మరింత పనిచేసే విధంగా డాక్టరేట్ ఇవ్వడం అనేది చాలా హర్షించదగ్గ విషయమని అన్నారు.

గతంలో కూడ పెద్దన్న ఎన్నో అవార్డులు పొందాలని వికలాంగుడైన సమాజ సేవలో ప్రజల కోసం పనిచేసే వ్యక్తిగ నిలబడడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు భవిష్యత్తులో మరిన్ని అవార్డులు రివార్డులు డాక్టరెట్లు పదవులు పొందాలని వారు ఆకాంక్షించారు.



ఈసన్మాన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రాజు, విహెచ్పిస్ మండల అధ్యక్షులు చోళసముద్రము శ్రీరాములు, ఎంఎస్పి ఎంఆర్పిఎస్ నాయకులు సూర్యనారాయణ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాల ఈశ్వ-రయ్య, ఉపాధ్యక్షులు ముద్దలాపురం జన్నె ఆంజనేయులు, జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదినారాయణ, ఉపాధ్యక్షులు వెంకట్రాముడు, ప్రజా సంఘాల నాయకులు ఆరవకూరు రమణ, కమ్మూరు వన్నూరప్ప, పాత్రికేయులు ఉ రవకొండ నియోజకవర్గం ఆంధ్రప్రభ పిసి ఇంచార్జ్ ఎర్రిస్వామి, సిద్ధప్ప , జగన్నాథ్, తదితరులు పాల్గొన్నారు

## మృతుడి కుటుబానికి న్యాయం చేశారా

యాడికి, మార్చి31 (అనంత ప్రభ)

యాడికి మండలంలోని బోయరెడ్డిపల్లి గ్రామం వద్ద ఉన్న అదాని సిమెంట్ కర్మాగారంలో 2024 డిసెంబరు 18న సిమెంట్ ఫ్యాక్టరీలో కూలర్లో మరమ్మతులు చేస్తుండగా జరిగిన ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడగా, ఒకరు మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన నిట్టూరు గ్రామానికి చెందిన ఉద్యోగి గూడూరు షణ్ముకానందరెడ్డి (30) బెంగళూరులో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ప్రజా మానవ హక్కుల కమిటీ సోమవారం సిమెంటు కర్మాగారం వద్దకు వెళ్లి మృతుడి కుటుంబానికి న్యాయం చేశారా అని ఫ్యాక్టరీ హెచ్ఆర్ సత్య శ్రీనివాసన్ వివరణ కోరగా కనీసం సమాధానం కూడా చెప్పలేదని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పి.హెచ్.ఆర్.సి సభ్యులు మాట్లాడుతూ మూడు నెలల క్రితం సిమెంటు కర్మాగారంలో మరమ్మతులు చేపట్టడానికి వెళ్లిన కార్మికులు కూలర్ తలుపులను ఒక్కసారిగా తెరవడంతో నిప్పుకణికలు ఎగిరి వారిపై పడ్డాయని, గాయపడ్డ షణ్ముకానందరెడ్డిని చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించగా మూడున్నర నెలలుగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. మృతుడి కుటుంబీకులను కలిసి వారి కోరిక మేరకు న్యాయ




పోరాటం చేస్తామని అన్నారు. తరచు ప్రమాదాలు జరుగుతున్నా యాజమాన్యం డబ్బుతో ప్రజల ప్రాణాలను కొంటూ నిర్లక్ష్యం వహిస్తుందని, సిమెంట్ కర్మాగారంలో జరిగిన ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని అదాని సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశా-రు. ఈ కార్యక్రమంలో స్టేట్ పీపుల్ హ్యూమన్ రైట్స్ జనరల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సుధాకర్ రెడ్డి, పీపుల్ హ్యూమన్ రైట్స్ స్టేట్ జనరల్ సెక్రెటరీ గుండా నారాయణస్వామి, పీపుల్స్ హ్యూమన్ రేట్స్ జిల్లా ప్రెసిడెంట్ విశ్వనాథ్, జిల్లా సెక్రెటరీ లింగం చంద్రశేఖర్ , జాయింట్ సెక్రటరీ కుండా లక్ష్మీ నారాయణ, తాడిపత్రి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మార్కె మురళి, సెక్రెటరీ చింతా తిరుమలేష్, జాయింట్ సెక్రెటరీ మూలింటి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## బసవేశ్వర జయంతిని అధికారికంగా ప్రభుత్వమే నిర్వహించాలి

ఉరవకొండ, మార్చి 31 (అనంత ప్రభ)

ఉరవకొండ నియోజకవర్గ సంక్షేమ సమాజం కమిటీ సభ్యుల సమావేశం వీరశైవ కళ్యాణమండపం నందు ఈరోజు అనగా సోమవారం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉత్తరాధికారి శ్రీ డాక్టర్ కరిబసవ రాజేంద్ర స్వాములవారు పాల్గొని వారు మాట్లాడుతూ 12 శతాబ్దంలోనే కుల మతాలు అన్నీ సమానమని స్త్రీ పురుషులు అందరూ సమానమేనని చాటి చెప్పడం సమాజంలో అందరూ ఒకటేనని అలాగే హిందూ ధర్మాన్ని వీరశైవ ధర్మాన్ని ఆయన యొక్క వేల ప్రవచనాల ద్వారా చాలామందిని చైతన్యవంతులు చేశారని అలాంటి మహనీయుల యొక్క జయంతిని ఇప్పటికే తెలంగాణలోనూ కర్ణాటక మహారాష్ట్రలోనూ అధికారికంగా ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయని మన ఆంధ్రప్రదేశ్లో కూడా అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు అదేవిధంగా అనంతపూర్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉగాది పురస్కారాలు అందుకున్న జెరెట్ల రాంపురం ప్రధాన అర్చకుడైన నాగరాజు స్వామివారికి అవార్డు రావడం వల్ల వీరశైవ సంక్షేమ సమాజం తరఫున ఘనంగా సన్మానించడం




జరిగింది ఈ సందర్భంగా వీరశైవ సంక్షేమ సమాజం నాయకులు మాట్లాడుతూ బసవ జయంతి సందర్భంగా ఉరవకొండ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున వీరశైవులందరూ ర్యాలీ నిర్వహించి. వీరశైవ పిల్లలు అందరికీ పదవ తరగతి ప్రతిభ పురస్కారాలు వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ బహుమతులు ఆ రోజు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో వీరశైవ సంక్షేమ సమాజం నాయకులు చంద్రిక మల్లికార్జున పాటిల్ నాగన్ గౌడ్ పాటిల్ నిరంజన్ గౌడ్ గంగవరం ప్రసాద్ తుద్దేకుంట భాస్కర్ రెడ్డి సత్యనారాయణ బొజ్జప్ప తట్రగల్లు నాగేంద్ర టీచర్ లోకేష్ వెలిగొండ గంగాధర్ దేశాయి వీరేష్ మోపిడి చంద్రమౌళి రాజేష్ స్వామి శివ స్వామి

## ఘనంగా రంజాన్ పండుగ వేడుకలు



యాడికి, మార్చి 31 (అనంత ప్రభ)

యాడికి మండల మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు రంజాన్ పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుండి మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యాడికి మండల కేంద్రములోని జామియా మసీదు నుండి ముస్లిం సోదరులు అల్లాహు అక్బర్ అంటూ ప్రవచనాలు చదువుకుంటూ ర్యాలీగా బయలుదేరి కోన రోడ్డు లోని ఈద్గా మైదానంలో మత గురువులు మహమ్మద్ ఉమర్ అలీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు, మత గురువు ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ విశిష్టతను వివరించారు. ప్రార్థన అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యాడికి సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు

## బలభద్ర లక్ష్మీదేవి మృతి పట్ల సంతాపం తెలిపిన బొంబాయి, కాసా



యాడికి, మార్చి 31(అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రములోని లాలెప్ప కాలనీలో నివాసం ఉంటున్న బలభద్ర రవి మాతృమూర్తి బలభద్ర లక్ష్మీదేవి గారు స్వర్గస్తులయ్యారు. విషయం తెలుసుకొన్న యాడికి మండల వైసీపీ సీనియర్ నాయకులు బొంబాయి రమేష్ నాయుడు, యాడికి ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్ బలభద్ర రవి నివాసం చేరుకొని లక్ష్మీదేవి గారి పార్థివదేహానికి నివాళులు అర్పించారు. మరియు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గొద్దుమర్రి రామమోహన్, కోట చౌదరి, తెల్లాకుల ప్రతాప్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించడం జరిగింది

## భక్తులకు మజ్జిగ పంపిణీ చేసిన పప్పు కుటుంబ సభ్యులు




ఉరవకొండ, మార్చి31 (అనంత ప్రభ)

యాడికి మండల పరిధిలోని చింతలాయపల్లి గ్రామ సమీపంలో వెలసిన శ్రీ లక్ష్మీ కొత్త వెంకటరమణ స్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవములో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు యాడికి మండల కేంద్రానికి చెందిన పప్పు వారి కుటుంబ సభ్యులు మజ్జిగ పంపిణీ చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. వేసవికాలంలో చల్లటి మజ్జిగ అందించిన పప్పు వారి కుటుంబ సభ్యులను భక్తులు అభినందించారు. ఈ సందర్భంగా పప్పు వారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మేము తొమ్మిది సంవత్సరాలుగా స్వామివారికి ఈ సేవా కార్యక్రమం చేస్తున్నామని, ఈ అవకాశం మాకు దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నామని తెలిపారు


## శ్రీ మారెమ్మ దేవత అమ్మవారికి పన్నీరపు బండ్లతో ప్రదక్షిణలు



కూడేరు, మార్చి31 (అనంత ప్రభ)

కూడేరు మండలం స్థానిక మండల పరిధిలోని జయపురం గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకొని సోమవారం రోజున శ్రీ మారెమ్మ దేవత అమ్మవారికి ఉదయం నుండి ఆకుపూజ,అర్చన, హారతి ప్రత్యేక విశిష్ట పూజ కార్యక్రమాల అనంతరం వివిధ పూజ పుష్పాలతో అలంకరించారు. పూర్వం నుండి ఆనవాయితీగా భక్తులు ఉగాది పండుగ సందర్భంగా శ్రీ మారెమ్మ అమ్మవారిని దర్శించుకుని మ్రొక్కులు తీరచ్చుకుంటారు. అందులో భాగంగా సోమవారం రోజున సాయంత్రం 4 గంటల సమయాన భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాల స్వీకరించారు. తదుపరి కార్యక్రమంలో భాగంగా అమ్మవారి గుడి చుట్టూ పన్నేరు బండ్లతో ప్రదక్షిణలు చేస్తూ మ్రొక్కులు తీర్చుకున్నారు.

## రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా వద్ద గుత్తి మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా ని కలిసిన కోటేగంటి నబి రసూల్



తాడిపత్రి, మార్చి 31 (అనంత ప్రభ)

పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా వద్ద నమాజ్ చేయడం మరియు సిద్దు బాష దర్గా వద్ద గుత్తి మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా ని మర్యాదపూర్వకంగా కలిసి పవిత్ర రంజాన్ పండగ ఈద్ ముబారక్ చెప్పిన కోటేగంటి నబి రసూల్ పవిత్ర రంజాన్ పండుగ పర్వదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, ప్రతి కుటుంబంలోనూ ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ.. ముస్లిం సోదర సోదరీమణులందరికీ రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన కోటేగంటి నబి రసూల్ .

సమాచార హక్కు చట్ట పరిరక్షణ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు

నూర్ భాషా ముస్లిం (దూదేకుల) సేవా సంఘం గౌరవ అధ్యక్షులు నూర్ భాషా ముస్లిం తన యొక్క సభ్యులు బంధుమిత్రుడు అందరూ కలవడం జరిగింది

## భక్తి శ్రద్ధల తో ఉపవాస దీక్షల నడుమ రంజాన్ ప్రార్థనలు



కూడేరు, మార్చి 31 (అనంత ప్రభ)

కూడేరు మండల కేంద్రంలో వున్నా ఈద్గా మైదానంలో భక్తిశ్రద్ధలతో సోమవారం రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు. , ఈ సందర్భంగా ముస్లిం సోదరులు మాట్లాడుతూ... , రంజాన్', దీనిని ముస్లింలు అత్యంత పవిత్రమైనదిగా ఈ నెలను భావిస్తారని తెలిపారు. దానికి ప్రధానమైన కారణం ' దివ్య ఖురాన్' గ్రంథం ఈ మాసంలో అవిర్భవించడమేనని క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే ' రంజాన్ మాసం అని తెలిపారు,

ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యమున్న రంజాన్ మాసం ప్రత్యేక ప్రార్థనలు, కఠిన ఉపవాస దీక్షలు, దానధర్మాలు, ఆధ్యాత్మిక సందేశాలతో సాగుతుందిని మహ్మద్ ప్రవక్త లా ఇల్లాహ ఇల్లాల్ల అనే సూత్రం ప్రకారం మానవులను కష్టాల నుంచి కాపాడేందుకు ఈ మాసాన్ని సృష్టించినట్లు చరిత్ర చెబుతోందిని వారు తెలిపారు. ఈ మాసంలో రోజుకు ఐదు పర్యాయాలు నమాజ్‌తో పాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం జరుగుతుందని పవిత్ర మాసంలో దానధర్మా లకు కూడా ప్రత్యేకమైన స్థానం ఉందిని వారు తెలిపారు, ఈ నెలలో చనిపోతే నేరుగా స్వర్గానికి చేరుతారని ముస్లింల ప్రగాఢ నమ్మకమని తెలిపారు, ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

## ఏ. ఐ. ఎస్. ఎ నాయకుల పై దాడిని ఖండించండి




ఉరవకొండ, మార్చి 31 (అనంత ప్రభ)

ఉరవకొండ పట్టణం లో సోమవారం అల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏ. ఐ. ఎస్. ఎ) మండల అధ్యక్షులు జై.ఎర్రిస్వామి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించరు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... నిన్నటి రోజున హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నందు తెలంగాణ ప్రభుత్వం యూనివర్సిటీ భూములను బలవంతంగా అక్రమించాలని రావడం జరిగింది దీన్ని గమనించిన విద్యార్థుల అక్కడకు చేరుకుని నిరసన తెలిపారు కానీ పదుల సంఖ్యలో పోలీసులు చేరుకొని క్యాంపస్ మొత్తాన్ని కూడా వాళ్ల ఆధీనంలో తీసుకొని అక్కడ ఉన్నటువంటి అనేక మంది విద్యార్థులను క్యాంపస్ నుండి ఎవరిని కూడా బయటకు రానికుండా జెసిబిలతో యూనివర్సిటీ పరిసర ప్రాంతంలో అక్రమ పనులను చేయడానికి ముందుకు పోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎవరైతే విద్యార్థులు జెసిబిలను మరియు అక్కడ జరుగుతున్న పనులను అడ్డుకున్నారు ఆ విద్యార్థులపై పోలీసులు దౌర్జన్యంగా అరెస్టులు పేరుతో చెల్లాచెదరగొట్టి విద్యార్థులపై దాడి చేసి అనేక మంది విద్యార్థులను పోలీస్ వాహనాలు ఎక్కించుకొని వివిధ ప్రాంతాలకు తీసుకొని వెళ్లడం జరిగింది దీనిని పూర్తిగా ఖండిస్తూ ఇప్పటికైనా విశ్వవిద్యాలయాల భూములు జోలికి ఎవరు రాకుండా ప్రభుత్వాలు గట్టిగా చర్యలు చేపట్టాలని ఈరోజు ఏదైతే దట్టమైన అడవులతో కూడుకొని విశ్వవిద్యాలయాల క్యాంపస్లో ఉన్న అడవులు చుట్టుపక్కల ఉన్నటువంటి వాళ్లకి జీవనాడిగా ఉన్నది ఒకవేళ ప్రభుత్వం ఈ భూములను ఆక్రమిస్తే పర్యావరణానికి నష్టం చేయడం జరుగుతుంది కాబట్టి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను ప్రభుత్వాలు ఆక్రమిస్తే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఐసా ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఏ. ఐ. ఎస్. ఎ నాయకులు యశ్వంత్, దినేష్, ఇమ్రాన్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ లక్ష్మీ కొత్త వెంకటరమణ స్వామి కళ్యాణోత్సవం





యాడికి, మార్చి31 (అనంత ప్రభ)

యాడికి మండల పరిధిలోని కమలపాడు పంచాయతీ చింతలాయపల్లి గ్రామ సమీపంలో వెలసిన శ్రీ లక్ష్మీ కొత్త వెంకటరమణ స్వామి వారి కళ్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా జరిగింది. మంగళ వాయిద్యాలతో భక్తులు వెంకటరమణ గోవిందా అంటూ నామస్మరణ చేస్తుండగా ఆలయ అర్చకులు హరి స్వామి, పవన స్వామి వేద మంత్రోచ్ఛారణలతో యాడికి మండల కేంద్రానికి చెందిన గంగవరం రవితేజ దంపతులు, రవ్వా మధుసూదన్ దంపతులు ఆసీనులై కళ్యాణ కార్యక్రమాన్ని భక్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి యాడికి మండలంలోని పలు గ్రామాల నుండి కాక పలు మండలాల ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కళ్యాణ మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు రవ్వా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయము అల్పాహారం, మధ్యాహ్నము అన్నదానం కార్యక్రమాలను నిర్వహించారు. యాడికి మండల కేంద్రం నుండి స్వామి ఆలయం వరకు ఉచిత ప్రయాణ సౌకర్యాలు తీర్థ ప్రసాదాలు మొదలైన అన్ని రకాల వసతులను ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమాలన్నీ గంగవరం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆలయానికి సహాయ సహకారాలు అందించిన వారికి సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగవరం చంద్రయ్య, శ్రీధర్, శేఖర్,పవన్, రాజా, గుణ మరియు రవ్వ కుటుంబ సభ్యులైన రవ్వ మోహన్, బాల పుల్లయ్య, పుల్లయ్య, రాము, నితిన్, శ్రీహరి,మహేష్, మధు తదితరులు పాల్గొన్నారు

## ప్రభాకర్ చౌదరి కి తెలుగుదేశం పార్టీ సైనికులు సన్మానం



అనంతపురం, మార్చి31 (అనంత ప్రభ)

ఈరోజు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే కి ఘనంగా అనంతపురం తెలుగుదేశం పార్టీ సైనికులు సన్మానం చేయబడినది గౌరవనీయులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ప్రభాకర్ చౌదరి గారికి ఉగాది పురస్కారాలు సందర్భంగా సన్మానం చేసి సత్కరించబడినది ఈ అవార్డు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఫ్యాక్షన్ మరియు అవినీతి నిర్మూలనే ధ్యేయంగా అవే సంస్థ స్థాపించి కరప్షన్ లేకుండా ఎంతోమందికి బహుమతులు అందించిన ఘనత ప్రభాకర్ చౌదరి గారికి దక్కినది శ్రమదానం ద్వారా 100 ఎకరాలు శిల్పారామం నిర్మాణం చేసి పచ్చదనాన్ని మొక్కల్ని పెంచిన చరిత్ర ఎల్ఈడి లైట్లు గాని రోడ్లు లేని రోజుల్లో వేసి చూపించిన వ్యక్తి ప్రభాకర్ చౌదరి గారు అందుకుగాను రాష్ట్రవ్యాప్తంగా ప్రభాకర్ చౌదరి గారిని గుర్తించి ఆయన్ని ఘనంగా సత్కరించి సన్మానం చేసిన మన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దానిలో భాగంగా ఈరోజు అనంతపురంలో ఘనంగా సన్మానం చేసిన తెలుగుదేశం సైనికులు తెలుగు మహిళలు భారీ ఎత్తున పాల్గొని ఆయనకు అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మాజీ మేయర్ సాకేగంపన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దేవల మురళి నగర అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్ తెలుగు మహిళా నగర అధ్యక్షురాలు విజయ శ్రీ రామంజి సురేంద్ర రామసుబ్బయ్య రవి నాయుడు సంజీవులు విజయ్ బాబు సున్నం శీన రంగా రాములమ్మ సుజాత గారు నెట్ కాన్ చంద్ర మాజీ కౌన్సిలర్ వెంకటేష్ చౌదరి శేఖర్ నాయుడు కుల్లయప్ప మురళి వసుంధర పలువురు భారీ ఎత్తున పాల్గొనడం జరిగినది

## మరమ్మతుకు నోచుకోని బోరు



ఉరవకొండ, మార్చి31 (అనంత ప్రభ)

ఉరవకొండ పట్టణంలో మాజీ సర్పంచు చిట్టా శ్రీధర్ నివాసముంటున్న ఇంటి ముందర బోరు మరమ్మతుకు నోచుకుంది. అయినప్పటికీ పట్టించుకునే నాథులే కరువయ్యారు. వేసవిలో నీటి ఎద్దడి నెలకొంది. బోరుమరమత్తు లు పట్టించుకునే వారే లేరని విమర్శిస్తున్నారు.

ఉరవకొండ పట్టణానికి తాగునీరు తెప్పించిన ఘనత చిట్టా పెద్ద వెంకటస్వామికి దక్కుతుంది. ఆయన ఇమేజ్ ని వాడుకొని ఆయన మనవడు చిట్టా శ్రీధర్ సర్పంచుగా గెలిచారు. ఏరు దాటాక తెప్ప తగలేసే రకంగా ఆయన తీరు మారింది. తన ఇంటి ముందున్న బోరు మరమ్మత్తు చేయించిన పాపాన ఆయన పోలేదు.

తర్వాత నర్రా సుజాత కుట్టుమిషన్ గుర్తుపై పోటీ చేసి గెలుపొందారు. పట్టణంలో నీటి ఎద్దడి గుర్తించి భవిష్యత్తులో తదనుగుణంగా ప్రణాళిక రచించి నర్రా సుజాత ఆమె భర్త నర్రా కేశన్న ప్రతి వార్డుల్లో ట్యాంకులు ఏర్పాటుచేసి తద్వారా నీటి ఎద్దడిని నిర్మూలించిన ఘనత దక్కించుకున్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చేయడం వెనక నర్రా దంపతుల చలువే.

మరమ్మతుకు నోచుకోని బోరు గురించి అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

## మృతిని కుటుంబాన్ని ఆదుకోవాలంటూ ఆందోళన

యాడికి, మార్చి 31(అనంత ప్రభ)

మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని యాడికి మండలం బోయరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఉన్న అదాని సిమెంట్ కర్మాగారంలో మృతుని కుటుంబ సభ్యులు బంధువులు ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళితే 2024 డిసెంబర్ 18న ఆదాని సిమెంట్ కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో నిట్టూరు గ్రామానికి చెందిన షణ్ముఖ రెడ్డి తీవ్రంగా గాయపడి బెంగళూరు ఆసుపత్రిలో దాదాపు మూడు నెలలు పైగా చికిత్స పొందుతూ మరణించారు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబ సభ్యులు కంపెనీ అధికారులకు విషయం తెలుపగా సరైన సమాధానం ఇవ్వలేదని మృతుని బంధువులు తెలిపారు. బెంగళూరు నుంచి అంబులెన్స్ లో మృతదేహాన్ని సిమెంట్ ఫ్యాక్టరీ వద్దకు తీసుకువచ్చి న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. తాడపత్రి ఏ ఎస్ పి రోహిత్ కుమార్ చౌదరి కంపెనీ అధికారులతో చర్చించి మృతుని కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేటట్లు చేస్తానని హామీ ఇచ్చినట్లు బంధువులు చెప్పారు. అనంతరం మృతదేహాన్ని నిట్టూరు గ్రామానికి తీసుకువెళ్లి అంత్యక్రియల కార్యక్రమం చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్పీ ఆదేశాల మేరకు యాడికి సిఐ ఈరన్న ఎస్ఐ వెంకటరమణ మరియు తాడపత్రి పోలీసు అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు

## ఆత్మకూరు పరీక్షా కేంద్రంలో విద్యార్థినినీ చితకబాదిన హెడ్మాస్టర్



ఆత్మకూరు, మార్చి 31 (అనంత ప్రభ)

ఆత్మకూరు మండల కేంద్రంలో జెడ్పీ హైస్కూ పరీక్ష కేంద్రంలో హెడ్మాస్టర్ శ్రీనివాసులు పరీక్షలు రాయడానికి వచ్చిన వేపచెర్ల విద్యార్థినిని అసభ్యంగా ప్రవర్తించి చితకబాదిన ఘటన ఆత్మకూరు హైస్కూల్లో చోటుచేసుకుంది. విద్యార్థుల పట్లా అసభ్యంగా ప్రవర్తించమే కాకుండ వేపచెర్లకు చెందిన పదవ తరగతి విద్యార్థినీని జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ శ్రీనివాసులు కర్రలతో దాడి చేసిన చితకబాదిన విషయం తెలుసుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు ఆరా తీయగా దాదాపు 5 మంది విద్యార్థులను చితాకబాదినట్లు బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ప్రసాద్ పరీక్షా కేంద్రం చీఫ్ గా బాధ్యతలు అప్పగించగా పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీలపై పరీక్షా కేంద్రంలో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా కర్రెలతో కొట్టడంతో విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్టు విద్యార్థిని తల్లిదండ్రులు తెలియజేశారు

## శ్రీ సంగమేశ్వర నూతన రథ నిర్మాణానికి విరాళాన్ని అందజేసిన (ట్రాంజెండర్) విష్ణు ప్రియ



కూడేరు, మార్చి 31 (అనంత ప్రభ)

కూడేరు మండల కేంద్రంలోని వెలసినటువంటి శ్రీ సంగమేశ్వర స్వామి నూతన రథ నిర్మాణన్ని భక్తుల సహకారంతో కూడేరు స్థానిక గ్రామ పెద్దలు రథ నిర్మాణానికి సంకల్పించిన గ్రామ పెద్దలకు కూడేరు గ్రామపంచాయతీ కడదరకుంట గ్రామానికి చెందిన విష్ణుప్రియ (ఉల్లిగమ్మ) వాళ్ళ గురువు కోణాపురం చంద్రకళ సంగమేశ్వర స్వామి నూతన రథానికి 25116 రూ లు విరాళాన్ని గుడి ఆవరణంలో స్థానిక గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా విష్ణుప్రియ కు మరియు వారి కుటుంబ సభ్యులకు శాలవా కప్పి అభినందించారు

## బాట చిన్న ఈశ్వరయ్య నూతన రథ నిర్మాణానికి 25166 రూ లు వితరణ



కూడేరు, మార్చి 31 (అనంత ప్రభ)

కూడేరు మండలం స్థానిక మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ జోడి లింగాల శ్రీ సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు శ్రీ సంగమేశ్వర స్వామి ఆశీస్సులతో భక్తుల సహకారంతో స్థానిక గ్రామ పెద్దలు నూతన రథ నిర్మాణానికి సంకల్పించారు. కూడేరు గ్రామానికి చెందిన పాట చిన్న ఈశ్వరయ్య సోమవారం రోజున శ్రీ సంగమేశ్వర నూతన రథ నిర్మాణానికి 25116 రూ ల విరాళాన్ని గుడి ఆవరణంలో స్థానిక గ్రామ ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా బాట చిన్న ఈశ్వరయ్య, వారి కుటుంబ సభ్యులకు శాలవాలు కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో బాట చిన్న ఈశ్వరయ్య, బాట పోతప్ప, బాట ఎర్రి స్వామి, బాట వెంకటేశులు, అంకే రమేష్, కుమ్మర వెంకటరమణ, అంకే సంగప్ప, తోపుదుర్తి రామచంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

## జెసి పవన్ కుమార్ రెడ్డి ని కలసిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి అయుబ్ భాష



తాడిపత్రి, మార్చి 31 (అనంత ప్రభ)

అనంతపూర్ జిల్లా తాడిపత్రి పట్టణంలో వహాబ్ బీడీ యజమాని అయిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి అయుబ్ భాష గారు జెసి పవన్ కుమార్ రెడ్డి తో కలసి రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

## ఇన్చార్జి మంత్రి టీజీ భరత్ ను కలిసిన అర్బన్ నియోజకవర్గ నాయకులు



అనంతపురం, మార్చి31 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ను అనంతపురం అర్బన్ నియోజకవర్గ నాయకులు కలిశారు. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ తో కలిసి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టిడిపి యువ నాయకుడు సుందర్ ఇతర నాయకులు మంత్రిని కలిశారు. నగరంలోని ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి రాగా ఆర్.అండ్.బి అతిథి గృహంలో మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్బన్ నియోజకవర్గంలో రాజకీయాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి మంత్రితో చర్చించారు. ఇప్పటికే ఎమ్మెల్యే దగ్గుపాటి పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి తమ దృష్టికి తీసుకు వచ్చారని త్వరలోనే అవి పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి టీజీ భరత్ తెలిపారు. మంత్రికి అర్బన్ నియోజకవర్గ నాయకులు ఘనంగా సత్కారం చేశారు.

## అంబేద్కర్ ఎస్సీ ఎస్టీ యాక్షన్ కమిటీ కో కన్వీనర్ గా సాకే పురుషోత్తం ఎంపిక.



ఉరవకొండ, మార్చి31 (అనంత ప్రభ)


పట్టణంలోని స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘాల నేతలు, విద్యార్థి సంఘాలు సోమవారం అత్యవసర సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు అంబేద్కర్ ఎస్సీ ఎస్టీ జాయింట్ యాక్షన్ కమిటీ ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సాకే పురుషోత్తమును కో కన్వీనర్ గా ఎంపిక చేశారు. సాకే పురుషోత్తం విద్యార్థి సమస్యలపై, అనేక రాజీలేని పోరాటాలు చేశారు. ఆయన ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అంబేద్కర్ జాయింట్ యాక్షన్ కమిటీ కో కన్వీనర్ సాకే పురుషోత్తం తెలిపారు.







# వట్టివేరుతో.. అందాన్ని మెరిపించేయండి..!



వట్టి వేరు... సకల సుగుణాలకూ పెట్టింది పేరు. పురాతన కాలం నుంచి సంప్రదయా ఔషధాలలో వట్టివేరును వాడతారు. వెట్టివేరులో ఐరన్, మాంగనీస్, విటమిన్ బి6 వంటి ఇతర ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. వేసవి తాపాన్ని తట్టుకోవడానికి, చాలా మంది వట్టివేరు షర్బత్ తాగుతూ ఉంటారు. దీనిలోని ఔషధ గుణాలు శరీరంలో విష వ్యర్థాలను, సూక్ష్మక్రిములను తొలగిస్తుంది. వేట్టివేరు రక్తప్రసరణను పెంచి, బీపీని తగ్గిస్తుంది. వట్టివేరు కేవలం ఆరోగ్య ప్రయోజనాలనే కాదు.. సౌందర్య ప్రయోజనాలను అందిస్తుంది. వట్టివేరులో శీతలీకరణ లక్షణాలు ఉంటాయి□ దీనిలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు మొటిమలు, అలెర్జీల నుంచి ఉపశమని ఇస్తాయి. వట్టివేరు వల్ల చర్మానికి ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో.. ఈ స్టోరీలో చూద్దాం.

వట్టివేరులో క్యూసిమోల్, వెటివెరోల్స్, ఐసోప్రొపెనిల్, ఫ్లేవనాయిడ్లు, ఫినాల్స్, ఫైటోకెమికల్స్ ఉంటాయి. దీనిలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీమైక్రోబయల్ గుణాలు ఉంటాయి. దీనిలో చర్మాన్ని పునరుజ్జీవింపజేసే లక్షణాలు కూడా ఉంటాయి.

చర్మాన్ని మెరిపిస్తుంది..

ఆయుర్వేదంలో చర్మాన్ని ప్రకాశవంతం చేసే మూలికగా.. వట్టివేరును వర్గీకరించారు. వట్టివే- రులోని ఫైటోకెమికల్స్‌కు మెలనోజెనిసిస్‌ను అణిచివేసే సామర్థ్యం ఉంది. మీ స్కిన్ కేర్ రొటీన్‌లో వట్టివేరు, వట్టివేరు నూనె ఉపయోగిస్తే.. డార్క్ స్పాట్స్, మొటిమల మచ్చలు, టాన్ తొలగుతుంది. స్కిన్ టోన్ గణనీయంగా పెరుగుతుంది.

జిడ్డు చర్మం ఉంటే..

హార్మోన్ల అసమతుల్యత సేబాషియస్ గ్రంథుల హైపర్యాక్టివిటీకి, సెబమ్ అధికంగా ఉత్పత్తి కావడానికి కారణం అవుతుంది. దీని వల్ల చర్మం జిడ్డుగా మారి, మొటిమల సమస్యకు దారితీస్తుంది. మీరు జిడ్డు చర్మంతో ఇబ్బంది పడుతుంటే.. వట్టివేరు అద్భుతంగా సహాయపడుతుంది. మీ స్కిన్ కేర్‌లో వట్టివేరు పొడిని యాడ్ చేసుకుంటే.. చర్మ స్రావాలు నియంత్రణలో ఉంటాయి. ఇది చర్మ రంధ్రాలను బిగుతుగా మారుస్తుంది, మొటిమలు రాకుండా రక్షిస్తుంది.

చర్మ ఇన్ఫెక్షన్లకు చెక్..

స్కిన్ ఇన్ఫెక్షన్లకు చికిత్స చేయడానికి వట్టివేరు అద్భుతంగా పనిచేస్తుంది. ఇది బ్యాక్టీరియా, ఫంగల్ ఇన్ఫెక్షన్లను నయం చేస్తుంది. దీనిలోని యాంటీబ్యాక్టీరియల్, యాంటీమైక్రోబయల్ గుణాలు స్టెఫిలోకాకస్ బ్యాక్టీరియాతో పోరాడతాయి. గాయాలు తగిలినప్పుడు.. త్వరగా నయం చేస్తుంది. ప్యూరెంట్ పుండ్లు చికిత్సలో దీన్ని ఉపయోగిస్తారు.

మొటిమలకు చెక్..

వట్టివేరు మొటిమలను తగ్గించడానికి సహాయపడుతుంది. ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు రంధ్రాలలో బ్యాక్టీరియా వృద్ధిని నిరోధిస్తాయి. సెబమ్ స్రావాన్ని నియంత్రించి, మొటిమలను నివారిస్తాయి. మీ బ్యూటీ ప్యాక్స్‌లో వట్టివేరు పొడి యాడ్ చేసుకుంటే మంచి రిజల్ట్ ఉంటాయి.

# పచ్చి మామిడి తింటే గుండెకి మంచిదా..

మామిడిపండ్ల సీజన్ వచ్చేసింది. అందరూ వీటిని హ్యాపీగా తింటూ ఎంజాయ్ చేస్తున్నారు. అయితే, కాయల్ని తినడం కూడా చాలా బెనిఫిట్స్ ఉంటాయ్. పచ్చిమామిడి కాయల్లో పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు, డైటరీ ఫైబర్, కెరోటినాయిడ్స్ ఉంటాయి. ఇవన్నీ కూడా ఆరోగ్యానికి మంచివి.

జీర్ణక్రియ..

పచ్చి మామిడి, వివిధ జీర్ణ ఎంజైమ్స్ స్రవించడానికి ప్రేగులను ప్రేరేపిస్తుంది. దీనిని తినడం వల్ల అసిడిటీ, అజీర్ణం, మలబద్ధకం, మార్నింగ్ సిక్‌నెస్ వంటి జీర్ణ సమస్యల్ని దూరం చేస్తుంది. వీటిని తినడం వల్ల వడదెబ్బ నుంచి కాపాడుకోవచ్చు. దీనిని తీసుకోవడం వల్ల హైడ్రేషన్ కూడా అందుతుంది.



ఏయే విటమిన్స్..

పచ్చి మామిడిలో విటమిన్ ఎ, సి, ఇలు పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ కూడా ఇమ్యూనిటీని పెంచుతుంది. చిగుళ్ళ సమస్యల్ని దూరం చేస్తాయి. అంతేనా, వీటిని తీసుకోవడం వల్ల తెల్ల రక్తకణాలు పెరిగి వ్యాధులతో పోరాడే బలాన్నిస్తుంది.



గుండెకి చాలా మంచిది..

పచ్చి మామిడి పండ్లలో మాంగిఫెరిన్ కంటెంట్, ట్రైగ్లిజరైడ్స్, కొలెస్ట్రాల్ సా- ్థయిలు, ఫ్యాటీ యాసిడ్ స్థాయిలను బ్యాలెన్స్ చేస్తుంది. దీంతో గుండె జబ్బుల ముప్పు తగ్గుతుంది. మామిడి పండ్లలో మెగ్నీషియం, పొటాషియం కూడా ఉ న్నాయి. అందుకే వీటిని తినడం వల్ల గుండె ఆరోగ్యం బాగుంటుంది.

చర్మం, జుట్టుకి మంచిది..

నిజానికి మామిడిలో కొల్లాజెన్ శాతం ఉంటుంది. ఇది చర్మ ఆరోగ్యానికి చాలా మంచిది. అంతే కాదు. దీనిని తీసుకోవడం వల్ల జుట్టు సమస్యలు దూరమై ఆరోగ్యంగా పెరుగుతుంది.

ఇమ్యూనిటీ..

పచ్చి మామిడిలో ఇమ్యూనిటీ పెంచే గుణాలు ఉంటాయి. ఇవి మనల్ని జబ్బుల నుంచి కాపాడతాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం.. ఓ కప్పు పచ్చి మామిడి రసంలో విటమిన్ ఎ , విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇవన్నీ కూడా ఆరోగ్యానికి చాలా మంచివి.

# వేసవిలో ఈ జ్యూస్ తాగితే ఒంట్లో వేడి పోయి.. రీఫ్రెష్ అవుతుంది..!



ఆధ్యాత్మికంగానూ, ఔషధగుణాలపరంగానూ మారేడు వృక్షానికి ఎంతో ప్రత్యేకత ఉంది. మారేడు పండ్లు, కాయలు, బెరడు, ఆకులు, పువ్వులు ఇలా అన్నీ ఔషధాల్లో ఉపయోగపడేవే. వేసవి కాలంలో మనం మారేడు కాయల గురించి ప్రత్యేకకంగా చెప్పుకోవాలి. మారేడు కాయను ఇండియన్ క్విన్స్, గోల్డెన్ యాపిల్, స్టోన్ యాపిల్, వుడ్ యాపిల్ అని కూడా పిలుస్తారు. ఈ పండ్లను జామ్స్, జెల్లీలు, శీతలపానీయాలు, జ్యూస్, షర్బత్ తయారు చేసుకుంటూ ఉంటారు. వేసవికాలంలో మారేడు పండ్లు తినడం, జ్యూస్ తాగడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి.. ఆయుర్వేద నిపుణుడు డాక్టర్ అబ్రార్ ముల్తానీ మనకు వివరించారు.

ఈ పోషకాలు ఉంటాయి..

మారేడు పండు పోషకాల స్టోర్ హౌస్ అని చెప్పొచ్చు. దీనిలో ప్రొటీన్లు, ఫైబర్, కాల్షియం, పొటాషియం, ఐరన్ విటమిన్ ఏ, సి, బి1, బి2 వంటి పోషకాలు ఉంటాయి.
బెస్ట్ సమ్మర్ డ్రింక్..

మారేడు జ్యూస్ సమ్మర్ బెస్ట్ డ్రింక్ అని డాక్టర్ అబ్రార్ అన్నారు. ఇది శరీరానికి చల్లదనంతోపాటు ఫ్రెష్‌నెస్ ఇస్తుంది. వేసవిలో ఈ పండు రసం తాగితే చాలా మంచిది. ఈ జ్యూస్ తాగితే.. ఒంట్లో వేడి పోవడంతో పాటు తక్షణశక్తి వస్తుంది. ఇది ఎండ వాతావరణానికి టానిక్‌గా పని చేస్తుంది.

జీర్ణక్రియకు మేలు చేస్తుంది..

మా రేడు పండ్ల రసం ఎముకల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మారేడు పండులోని కాల్షియం ఎముకలు, దంతాలు బలంగా ఉండేలా తోడ్పడుతుంది. మారేడు పండ్ల రసం తక్షణ శక్తిని ఇస్తుంది. రక్తహీనత దూరం అవుతుంది..
రక్తహీనత దూరం అవుతుంది..

మారేడు పండ్ల రసంలో విటమిన్ %దీ%2 ఉంటుంది. ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి సహాయపడుతుంది. రోజూ మారేడు పండ్ల జ్యూస్ తాగితే రక్తలేమి దూరం అవుతుంది.
జ్యూస్ ఇలా తయారు చేసుకోండి..
జ్యూస్ ఇలా తయారు చేసుకోండి..

పండిన మారేడు – ఒకటి, బెల్లం – రుచికి సరిపడా, దాల్చిన చెక్కపొడి – పావు టీస్పూను, జాజికాయ పొడి – పావు టీస్పూను, చల్లటి నీళ్లు –జ్యూస్‌కు సరిపడా.
ముందుగా మారేడు పండును పగులకొట్టి లోపలి గుజ్జును వేరుచేయాలి. ఈ గుజ్జును మిక్సీ జార్‌లో వేసి సరిపడా నీళ్లు పోసి బ్లెండ్ చేయండి. దీన్ని వడపోసి సరిపడా బెల్లం వేసుకోవాలి. చివరిగా దీనిలో దాల్చిన చెక్క, జాజికాయ పొడివేసుకుని జ్యూస్ ఎంజాయ్ చేయండి.

# ఈ 5 ఆసనాలతో మీ లివర్ సేఫ్..



లివర్ ఫెయిల్ అయితే, మన బాడిలో చాలా పనులు జరగవు. ఫ్యాటి లివర్స్, లివర్ ఫైబ్రోసిస్, హెపటైటిస్, లివర్ ఫెయిల్యూర్, లివర్ క్యాన్సర్ వంటి సమస్యల నుండి కూడా రక్షించడం కూడా చాలా ముఖ్యం. దీనికి మంచి ఫుడ్ తీసుకోవడం, హైడ్రేటెడ్‌గా ఉండం, మంచి నిద్రతో పాటు యోగాసనాలు కూడా హెల్ప్ చేస్తాయి. అవేంటంటే..

బాలాసన..

బాలాసనం.. ఇది చేయడం వల్ల వల్ల లివర్‌కి హెల్ప్ అవుతుంది. ఎలా చేయాలంటే...

ముందుగా మీ వెన్నెముకని స్ట్రెయిట్‌గా పెట్టి మోకాళ్ళపై కూర్చోవాలి. రెండు తొడలు ఛాతీకి తగిలేలా నెమ్మదిగా శర్షీరన్ని ముందుకు వంచాలి. తల మోకాళ్ళని దాటి నేల తాకే వరకూ ముందుకు వంగండి.
తర్వాత రెండు చేతులను కాళ్ళకు ఇరువైపులా నిటారుగా చేసి నేల వైపు చూడండి.
20 నుంచి 25 సెకన్ల పాటు ఈ పొజిషన్‌లో ఉండండి. తర్వాత సాధారణ స్థితికి రావాలి. కొన్ని సెకన్ల తర్వాత మళ్ళీ ఇలానే చేయండి. ఇలా రోజుకి 5 సార్లు చేయండి.

అనులోమ, విలోమ ప్రాణాయామం..

ప్రాణాయమం కూడా చాలా హెల్ప్ చేస్తుంది. ఇందులో ముఖ్యంగా అనులోమ్, విలోమ ప్రాణాయామం చేయాలి. ఇందులో ముక్కుని ఓ వైపు మూసి శ్వాసన పీల్చి, కాసేపు పట్టుకుని మరో వైపు కూడా ఇలా చేయండి. ఎలా చేయాలంటే..

ముందుగా పద్మాసనంలో కూర్చోండి.
రెండు చేతులను మోకాళ్ళపై ఉంచండి. కుడి బొటన వేలితో కుడి ముక్కు రంధ్రాన్ని గట్టిగా పట్టుకుని ఎడమ ముక్కు రంధ్రం ద్వారా గాలి పీల్చాలి.
5 నుంచి 10 సెకన్ల పాటు ఇలా శ్వాసను పీల్చండి. తర్వాత బొటనవేలుని కుడి నాసికా రంధ్రానికి పైన వదలండి. దాని ద్వారే శ్వాస వదలండి. తర్వాత ఎడమ ముక్కు రంధ్రాన్ని మధ్య వేలితో గట్టిగా మూయాలి.
10 నుంచి 15 సెకన్ల పాటు ఇలానే చేయండి.

ధనురాసనం..

ధనురాసనం.. వంగిన విల్లు లాంటి ఈ పోశ్చర్ లివర్‌కి చాలా మంచిది. మీ కడుపు నేలను తాకేలా నేలపై పడుకోండి. కాళ్ళని కొద్దిగా దూరంగా పెట్టి చేతులు శరీరం వైపులా ఉంచండి.

మీ చేతలతో పాదాలను పట్టుకుని సున్నితంగా పట్టుకోండి. ఇప్పుడు గాఢంగా పీల్చి ఛాతీ, కాళ్ళని పైకి ఎత్తండి.
మీరు ఎంతసేపు వీలైతే అంతవరకు ఇలానే ఉండండి.
తర్వాత మెల్లిగా సాధారణ స్థితికి రండి. ఈ ఆసనంతో ఊపిరితిత్తులు, కాలేయానికి చాలా మంచిది. కాలేయ పనితీరు కూడా పెరుగుతుంది.

అథోముఖ స్వనాశన..

ముందుగా నిలబడాలి.
ఆ తర్వాత మెల్లిగా చేతలని వంచుతూ మీ శరీరాన్ని త్రిభుజాకారంలో ఉండేలా చూసుకోండి. ఇప్పుడు నెమ్మదిగా తలని పైకి ఎత్తండి. మోకాళ్ళని కొద్దిగా వంచి కాళ్ళని బయటికి చాచాలి. శ్వాస తీసుకుంటూ వదలండి.


నవాసన..

ముందుగా చాప మీద నేరుగా పడుకోండి. రెండు చేతులని పక్కకి ఆనించి పెట్టండి. దీర్ఘంగా శ్వాసని పీలుస్తూ వదలండి. ఒకేసారి కాళ్ళు, శరీర భాగాన్ని నడుముపైకి ఎత్తండి.
పెల్విస్ మాత్రమే నేలపై ఉండేలా చూసుకోండి.
తర్వాత నెమ్మదిగా రెండు చేతులని పైకెత్తి మోకాళ్ళ మధ్య నిటారుగా ఉండాలి.
దీనిని చేయడం వల్ల శరీరంలోని కండరాలన్నీ ఫ్లెక్సిబుల్‌గా మారి. కడుపు ప్రాంతంలో ఫోకస్ చేయడం వల్ల లివర్‌కిచాలా మంచిది. ఈ పొజిషన్‌లో 5 నిమిషాలు ఉండాలి.

AP 4PG 01 04 2025 TUESDAY qxp_Layout 1 01-04-2025 06:00 AM Page 4



# యంగ్ బ్యూటీలకు కాజల్ అగర్వాల్ ఛాలెంజ్.. లేట్ వయస్సులోనూ ఇలా



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ తెలుగు ప్రేక్షకులను ఎంతలా అలరించిందో తెలిసిందే. దాదాపు 20 ఏళ్ల పాటు చలన చిత్ర పరిశ్రమలో యాక్టివ్ గా కనిపిస్తోంది. వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తూనే వస్తోంది. 'లక్ష్మి కళ్యాణం', 'చందమామ' వంటి చిత్రాలతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. తొలి చిత్రాలతోనే ఆడియెన్స్ నుంచి మంచి గుర్తింపును సొంతం చేసుకుంది. తన టాలెంట్ తో అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చింది. కాజల్ అగర్వాల్ ముంబైలో పుట్టి పెరిగినప్పటికీ టాలీవుడ్ చిత్రాలతోనే మంచి గుర్తింపును సొంతం చేసుకుంది. మహారాష్ట్రలోని బాంబే పట్టణంలో ఈ బ్యూటీ 1985 జూన్ 19న జన్మించింది. వాళ్ల తండ్రి విజయ్ అగర్వాల్ బిజినెస్ మ్యాన్ కావడం విశేషం. ఇక కాజల్ అగర్వాల్ కు తన పోలికలతోనే ఉన్న చెల్లి నిషా అగర్వాల్ కూడా ఉన్నదన్న సంగతి అందరికీ తెలిసిందే. ఆమె కూడా తెలుగులో పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించింది.

ఇదిలా ఉంటే.. కాజల్ అగర్వాల్ టాలీవుడ్ లోనే కాదు సౌత్ లోనే స్టార్ హీరోయిన్ గా ఎదిగిన సంగతి తెలిసిందే. ఆమె నటనకు దక్షిణాది ఆడియెన్స్ ఎంతో ఫిదా అయ్యారు. టాలీవుడ్ లోని స్టార్ హీరోలు ప్రభాస్, అల్లు అర్జున్, రామ్ చరణ్, రవితేజ, రానా దగ్గుబాటి... మెగా స్టార్ చిరంజీవితోనూ కూడా నటించే ఛాన్స్ దక్కించుకుంది. బడా హీరోలకు ధీటుగా నటించి మెప్పించింది. తెలుగులోనే కాకుండా కోలీవుడ్, బాలీవుడ్ లో వరుసగా సినిమాలు చేస్తూ అలరిస్తోంది. అయితే, కాజల్ అగర్వాల్ వరుస సినిమాలతో ఓవైపు ప్రేక్షకులను అలరిస్తూనే మరోవైపు సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్ గా కనిపిస్తోంది. తన ఫ్యాన్స్ కు ఎప్పుడూ టచ్ లోనే ఉంటూ తన గురించిన అప్డేట్స్ ను అందిస్తూ వస్తోంది. ఈ క్రమంలోనే స్టన్నింగ్ లుక్ లో మెరుస్తూ మైండ్ బ్లాక్ చేస్తోంది. లేట్ వయస్సుల్లోనూ ఈ హీరోయిన్ గ్లామర్ మెరుపులు మెరిపిస్తోంది. కాగా తాజాగా తన లేటెస్ట్ లుక్ కు సంబంధించిన ఫొటోలను అభిమానులతో పంచుకుంది. కాజల్ అగర్వాల్ తన లేటెస్ట్ ఫొటోషూట్ తో ఆకట్టుకుంటోంది. బాడీ టైట్ ఫిట్ డ్రెస్ లో గ్లామర్ ను వెదజల్లింది. యంగ్ లుక్ తో స్లిమ్ ఫిట్ అందంతో మైమరిపించింది. అయితే కాజల్ అగర్వాల్ నాలుగు పదుల వయస్సులోనూ ఇంత బ్యూటీఫుల్ లుక్ లో మెరుస్తుండటంతో అభిమానులు పొగడ్తలతో ఆకాశానికి ఎత్తుతున్నారు. ఇక తన లేటెస్ట్ లుక్ కు సంబంధించిన ఫొటోలను లైక్స్, కామెంట్లతో నెట్టింట తెగ వైరల్ చేస్తున్నారు.

అయితే, కాజల్ అగర్వాల్ 2020లోనే తన స్నేహితుడైన గౌతమ్ కిచ్లును పెళ్లి చేసుకుంది. ఆ తర్వాత కొడుకు నీల్ కిచ్లుకు జన్మనిచ్చి తల్లిగా ప్రమోషన్ పొందింది. కాగా, తన పెళ్లి, ప్రెగ్నెసి తర్వాత కాజల్ రూపసౌందర్యం కాస్తా మారిపోయింది. దీంతో కాజల్ మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సి వచ్చింది. అయితే ప్రస్తుతం తన లేటెస్ట్ ఫొటోషూట్ తో వింటేజ్ లుక్ లో మెరియడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఆమె గ్లామర్ మెరుపులకు ఫిదా అవుతున్నారు. ఇక కాజల్ అగర్వాల్ చివరిగా 'ఇండియన్ 2' చిత్రంతో అలరించింది. ప్రస్తుతం 'సికందర్', మంచు విష్ణు 'కన్నప్ప' చిత్రాలతో అలరించేందుకు సిద్ధమవుతోంది. మరోవైపు ఇండియన్ 3, ది ఇండియా స్టోరీ వంటి చిత్రాల్లోనూ నటిస్తూ బిజీగా ఉంది




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.

అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యూరిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు.పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# ఎన్టీఆర్‌తో త్రివిక్రమ్ భారీ పౌరాణికం.. ఇండియన్ హిస్టరీలో రానటువంటి మూవీకి ప్లాన్.. నాగవంశీ



తెలుగు సినిమా దగ్గర ఉన్నటువంటి టాప్ మోస్ట్ దర్శకుల్లో అంతా పాన్ ఇండియా సినిమా వైపు వెళుతున్నారు కానీ ఎప్పుడో వరల్డ్ క్లాస్ థాట్ ప్రాసెస్ తో సినిమాలు చేసిన దర్శకుడు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మాత్రం ఇప్పటికీ వెనుకబడి ఉండడం అనేది తన అభిమానులకి కొంచెం ఇబ్బందికర అంశమే అనిక్ చెప్పక తప్పదు. కాగా త్రివిక్రమ్, రాజమౌళి అలానే సుకుమార్ ఈ ముగ్గురూ తెలుగు సినిమా దగ్గర వేసుకున్న ముద్ర వేరు. ముగ్గురూ సెపరేట్ లీగ్ తో తమ మార్క్ సినిమాలు తీసి అలరించారు. ఇక ముగ్గురలో రాజమౌళి త్రివిక్రమ్ నడుమ కొన్ని అంశాలు కలుస్తాయి. ఇద్దరికీ చరిత్ర కోసం ముఖ్యంగా మన పురాణాలు నుంచి ప్రేరణ చెందడం వారి సినిమాల్లో ఎన్నో సీన్స్ లో కనిపిస్తూ ఉంటాయి. అయితే రాజమౌళి ఇలా పలు హిస్టారికల్ సినిమాలు వాటిలో వాటి ఛాయలు పెట్టి చేశారు కానీ ఇంకా త్రివిక్రమ్ నుంచి ఇలాంటి సినిమాలు ఇంకా పడలేదు.

సో దీనితో గురూజీ నుంచి ఒక సరైన సినిమా ఎప్పుడు పడుతుందా అని చూస్తున్న వారికి మాత్రం త్రివిక్రమ్ ఇచ్చే సమాధానం మామూలు రీతిలో ఉండదు అని తన ఆస్థాన నిర్మాత సూర్య దేవర నాగవంశీ చెబుతున్నారు. కాగా నాగవంశీ త్రివిక్రమ్ కాంబినేషన్ లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్ తో ఇద్దరితో సినిమాలు ఉన్నాయి. కాగా ఈ ఇద్దరిలో ఒక సినిమా మాత్రం వచ్చాక మొత్తం ఇండియన్ సినిమా మాట్లాడుకునే రేంజ్ లో ఉంటుంది అని చెబుతున్నారు. కాగా పలు ఇతిహాస సినిమాలు ఇపుడు తక్కువ అవుతున్నాయి అనే ప్రశ్నకి త్రివిక్రమ్ ప్లాన్ చేస్తున్న సినిమా అయితే అసలు అటు రామాయణం, మహాభారతం లతో సంబంధం లేకుండా ఇపుడు వరకు రాని కొత్త సినిమాగా తీసుకొచ్చేలా ప్లాన్ చేస్తున్నట్టుగా తెలిపారు.

దీనితో త్రివిక్రమ్ గేమ్ లోకి కొంచెం లేట్ గానే వస్తున్నప్పటికీ ఇండియన్ సినిమా దగ్గర దిమ్మ తిరిగిపోయే సినిమాతో రాబోతున్నారని చెప్పవచ్చు. కాగా త్రివిక్రమ్ కి మహారభారతం, రామాయణ ఇతిహాసాలపై ఉన్న పట్టు ఏ పాటిదో తన పాత ఇంటర్వ్యూలు చూస్తే తెలుస్తుంది.

అంత అవగాహనా ఉన్న త్రివిక్రమ్ మంచి క్లారిటీతో ఓ సినిమా చేస్తే దాని ఇంపాక్ట్ ఖచ్చితంగా మరో లెవెల్లో ఉంటుంది. సో తన నుంచి ఆ చిత్రం ఎపుడు వస్తుందో ఏ హీరోతో వస్తుందో అనేది ఇప్పుడుకి సస్పెన్స్ గానే నిలిచింది. సో వేచి చూడాలి ఈ ప్రాజెక్ట్ ఏంటి ఎవరితో అనేది. కాగా త్రివిక్రమ్ నుంచి గత ఏడాదిలో సూపర్ స్టార్ మహేష్ బాబుతో గుంటూరు కారం సినిమా వచ్చింది. ఆ సినిమా తర్వాత అల్లు అర్జున్ తో సినిమా స్టార్ట్ కావాల్సి ఉంది కానీ ఈ సినిమా ప్రస్తుతానికి హోల్డ్ లో ఉందట.

# షణ్ముఖ మూవీ రివ్యూ అండ్ రేటింగ్

ఎలాంటి వైద్య వసతులు లేని మారుమూల గ్రామంలో నిత్యం పూజలు చేసే ఉపాసకుడు విగాండ (చిరాగ్ జానీ) దంపతులకు ఆరు ముఖాలతో కురూపిగా ఉన్న కుమారుడు జన్మిస్తాడు. ఆ బాలుడి ముఖం చూసిన వారాంత షాక్ గురవుతుంటారు. తన కుమారుడికి విగాండ షణ్ముఖ అని నామకరణం చేస్తాడు. తన కుమారుడు కూరుపి అవతారం నుంచి అందగాడుగా కావడానికి మాంత్రికుడు సలహాతో ఓ ప్రయత్నం చేస్తుంటాడు. ఇదిలా ఉండగా, కార్తీ (ఆది సాయికుమార్) పోలీస్ ఆఫీసర్. డ్రగ్స్ మాఫియాను పట్టుకొనేందుకు వెళ్లిన సమయంలో జరిగిన దాడిలో తన పిస్టల్ కోల్పోతాడు. ఇక కాలేజీలో లవర్ సారా (అవికా గోర్) క్రిమినాలజీపై రీసెర్చ్ చేసి.. అదృశ్యం అవుతున్న అమ్మాయిల ఆచూకీ కోసం ఆరా తీస్తుంటుంది. మహేశ్ బాబు కెరీర్ లోనే చెత్త సినిమా.. 9 ఏళ్లకు తప్పు ఒప్పుకున్న డైరెక్టర్.. ఎవరంటే?"మహేశ్ బాబు కెరీర్ లోనే చెత్త సినిమా.. 9 ఏళ్లకు తప్పు ఒప్పుకున్న డైరెక్టర్.. ఎవరంటే?"

తన కుమారుడిని అందగాడిగా చేయడానికి విగాండ ఎలాంటి నేరాలకు పాల్పడ్డాడు? అమ్మాయిల అదృశ్యానికి విగాండకు ఎదైనా సంబంధం ఉందా? కార్తీ, సారా ఎందుకు విడిపోయారు? కార్తీ, సారా మధ్య మళ్లీ ప్రేమ చిగురించిందా? పోగొట్టుకొన్న తుపాకిని కార్తీ సంపాదించుకొన్నాడా? సారాను విగాండ మనుషులు కిడ్నాప్ చేసి ఏం చేశారు? ఈ కథలో శ్రీకాంత్, కౌశిక్ (కౌశిక్), వర్షిత (అరియానా గ్లోరి), కమల్ (ఆదిత్య ఓం) పాత్రలు ఏంటి? షణ్ముఖ చివరికి అందగాడుగా మారాడా? అనే ప్రశ్నలకు సమాధానమే షణ్ముఖ సినిమా కథ. ఆరు ముఖాలు ఉన్న కురూపి షణ్ముఖ జననంతో సినిమా కథ ఆసక్తిగా మొదలవుతుంది. అయితే షణ్ముఖను అందగాడుగా చేయాలనే తండ్రి విగాండ ప్రయత్నాలు ఏం విధంగా ఉంటాయనే క్యూరియాసిటీని దర్శకుడు క్రియేట్ చేశారు. కానీ కథను సామాజిక అంశాలు, డ్రగ్స్ యాక్టివిటీస్ వైపు మళ్లించడం వల్ల కథ ట్రాక్ తప్పిందా? అనే అనుమానం కలుగుతుంది. షణ్ముఖ ఎపిసోడ్ వరకు రకరకాల పాత్రలు, వారి మధ్య సన్నివేశాలు ప్రేక్షకుడిని గందరగోళానికి గురి చేస్తాయి. దర్శకుడు ఎంచుకొన్న స్క్రీన్ ప్లే కూడా కాంప్లికేటెడ్‌గా ఉండటంతో ఏం జరుగుతుందనే విషయం అర్ధం కాదు. కానీ చివరి 20 నిమిషాలు కథను నడిపించిన విధానం దర్శకుడికి కథపై ఉన్న పట్టు ఏమిటో తెలుస్తుంది. అందుకే పవన్ కల్యాణ్ కు ఓటేయలేదు.. కోర్ట్ హీరోయిన్ శ్రీదేవి"అందుకే పవన్ కల్యాణ్ కు ఓటేయలేదు.. కోర్ట్ హీరోయిన్ శ్రీదేవి" నటీనటుల విషయానికి వస్తే.. ఆది సాయికుమార్ పోలీస్ ఆఫీసర్‌గా తన పాత్రలో ఒదిగిపోయాడు. ఆ క్యారెక్టర్ తగినట్టుగా యాటిట్యూడ్, బాడీ లాంగ్వేజ్‌ను చక్కగా చూపించాడు. కథలో వేరియేషన్స్ ఎక్కువగా ఉండటం.. అలాగే పాత్రలు కూడా ఎక్కువగా ఉండటం వల్ల సోలోగా ఆది చేయడానికి స్కోప్ లేకపోయింది. అవిక గోర్ గ్లామర్‌తోపాటు ఫెర్ఫార్మెన్స్‌తో మెప్పించే ప్రయత్నం చేసింది. చిరాగ్ జానీ, ఆదిత్య ఓం తదితరులు ఫర్వాలేదనిపించారు. ఆరియానా గ్లోరి ఇతరులు అతిథి పాత్రలకే పరిమితమయ్యారు.

టెక్నికల్ విషయానికి వస్తే..ఈ సినిమాకు అసలు సిసలైన హీరో రవి బస్రూర్. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో పలు సన్నివేశాలను బాగా ఎలివేట్ చేశాడు. చివరి 20 నిమిషాలు సినిమాలో రవి బస్రూర్ మార్క్ కనిపించింది. మిగితా సాంకేతిక అంశాలు ఫర్వాలేదనిపిస్తాయి. తులసీరామ్ సాప్పని, రమేష్ యాదవ్, షణ్ముగం సాప్పని అనుసరించిన ప్రొడక్షన్ వాల్యూస్ బాగున్నాయి. చివర్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో క్రియేట్ చేసిన సాంగ్ ఆకట్టుకొనేలా ఉంది.

కమర్షియల్ వాల్యూస్ కలిపి చేసిన డివోషనల్ థ్రిల్లర్ షణ్ముఖ. కథాపరంగా మంచి పాయింట్‌తో దర్శకుడు షణ్ముగం చేసిన ప్రయత్నం బాగానే ఉంది. కథను బలమైన సన్నివేశాలుగా విడగొట్టడంలో, రాసుకోవడంలో సరిగా దృష్టిపెట్టాలేదా? అనిపిస్తుంది. సినిమా ఓపెనింగ్, క్లోజింగ్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. మధ్యలో వచ్చే సన్నివేశాలు, కథ, కథనాలు కొంత వీక్‌గా అనిపిస్తాయి. క్లైమాక్స్‌లో కంటెంట్ పరంగా, రవి బస్రూర్ మ్యూజిక్ పరంగా ఓ మ్యాజిక్ చేసే ప్రయత్నం అభినందనీయం. డివోషనల్ థ్రిల్లర్స్ చూడాలనే ఆసక్తి ఉన్నవారు షణ్ముఖ సినిమాను చూడొచ్చు.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com